www.aksharavelugu.com

# అక్షర వెలుగు

www.aksharavelugu.com

తెలుగు దిన పత్రిక

శని వారం

18 జూన్ 2022

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్

సంపుటి - 01, సంచిక-103

పేజీలు - 4 వెల రూ. 5

ఎడిటర్ :
గోసుకొండ పృధ్వీరాజు

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

# సికింద్రాబాద్ ఘటనతో రైల్వే శాఖ అప్రమత్తం



## సికింద్రాబాద్ పరిధిలో 71 రైళ్ల రద్దు

ఎంఎంటీఎస్ రైళ్లను కూడా రద్ద చేసిన రైల్వే

రవాణ స్తంబించడంతో ప్రయాణికుల ఇబ్బందులు

**హైదరాబాద్, జూన్17(అక్షర వెలుగు):** సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఘటనతో రైల్వే శాఖ అప్రమత్తమయింది. సికింద్రాబాద్ పరిధిలో 71 రైళ్లను రద్దుచేసింది. పలు రైళ్లను దారిమళ్లించింది. ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో రైల్వే అధికారులు హైదరాబాద్‌లో ఎంఎంటీఎస్ రైళ్లను రద్దుచేశారు. మొత్తం 44 ఎంఎంటీఎస్ సర్వీసులను రద్దుచేస్తున్నట్లు ప్రకటించారు. వీటితోపాటు సికింద్రాబాద్-ధన్‌పూర్, ఈస్ట్‌కోస్ట్ రైళ్లను క్యాన్సల్ చేశారు.ఇప్పటికే సికింద్రాబాద్-ధన్‌పూర్, హైదరాబాద్-షాలిపూర్ ఈస్ట్‌కోస్ట్ రైళ్లను రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. కాచీగూడ, నాంపల్లి రైల్వే స్టేషన్లలో రైళ్లను నిలిపివేశారు. స్టేషన్లలోకి పోలీసులు ఎవరినీ అనుమతించడంలేదు. రైళ్ల రద్దుతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హైదరాబాద్- శాలీమార్, ఉందానగర్- సికింద్రాబాద్, సికింద్రాబాద్-ఉందానగర్, సికింద్రాబాద్-రేపల్లే, షిరిడీసాయి నగర్-కాకినాడ పోర్టు, భువనేశ్వర్-ముంబై రైళ్లను అధికారులు రద్దు చేశారు. భువనేశ్వర్-ముంబై సీఎస్‌టీ రైలును దారి మళ్లించారు. భువనగిరి జిల్లాలోని నాగిరెడ్డిపల్లి రైల్వే స్టేషన్‌లో శబరి ఎక్స్‌ప్రెస్‌తోపాటు, పలు గూడ్స్ రైళ్లను నిలిపివేశారు. హౌవ్‌డా-సికింద్రాబాద్ రైలు, సిర్పూర్ కాగజ్‌నగర్-సికింద్రాబాద్ రైళ్లను మౌలాలిలో, గుంటూరు-వికారాబాద్ రైలును చర్లపల్లిలో నిలిపివేశారు. మరికొన్ని సర్వీసులను దారిమళ్లించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన అగ్నిపథ్ కు వ్యతిరేకంగా సికింద్రాబాద్‌లో ఆర్మీ అభ్యర్థులు నిరసనకు దిగారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో పెద్దఎత్తున విధ్వంసానికి పాల్పడ్డారు. మూడు రైళ్లను తగులబెట్టారు. పార్సిళ్లను రైలు పట్టాలపై వేసి కాల్చివేశారు. పలు రైళ్ల అద్దాలను ధ్వంసం చేశారు. సీసీ కెమెరాలు, డిస్‌ప్లే బోర్డులను పగులగొట్టారు. ప్లాట్‌ఫామ్‌పై ఉన్న దుకాణాలను ధ్వంసం చేయడంతోపాటు లూటీ చేశారు. దీంతో ఆదోంళనకారులను అదుపుచేయడానికి రైల్వే పోలీసులు 15 రౌండ్లు గాల్లోకి కాల్పులు జరిపారు. ఇందులో గాయపడిన ఓ ఇద్దరు మృతిచెందారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నది. మృతిచెందిన వ్యక్తిని నిర్మల్ జిల్లాకు చెందిన దామోదర్ కురేషియాగా గుర్తించారు. ఆర్మీ రిక్రూట్‌మెంట్ బోర్డుకు వెళ్లి అక్కడినుంచి స్టేషన్‌కు వచ్చినట్లు గుర్తించారు.

## దేశంలో నిరుద్యోగ సంక్షోభం తీవ్రం

ఆందోళనలపై కెటిఆర్ ట్వీట్



**హైదరాబాద్, జూన్17(అక్షర వెలుగు):** రక్షణశాఖ ప్రవేశపెట్టిన అగ్నిపథ్ స్కీమ్‌ను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా యువత ఆందోళన చేపడుతున్న తరుణంలో వివిధ వర్గాలుకేంద్రం తీరుపై విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ అంశంపై రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కేటీఆర్ స్పందించారు. దేశంలో నిరుద్యోగ సంక్షోభం తీవ్ర స్థాయిలో ఉందని,

2

## శంషాబాద్‌లో బంగారం పట్టివేత



**హైదరాబాద్, జూన్17 (అక్షర వెలుగు):** శంషాబాద్ విమానాశ్రయంలో మరోమారు భారీగా బంగారం పట్టుబడింది. రూ. 28 లక్షల 52వేల విలువైన విదేశీ బంగారం పట్టుకున్నారు. దుబాయి నుంచి వచ్చిన ప్రయాణికుడి వద్ద పసిడిని గుర్తించిన అధికారులు.. సీజ్ చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. హైదరాబాద్ వచ్చిన ప్రయాణికుడి

2

## అగ్నిపథ్ పథకం నిరుద్యోగులకు మేలు చేసేదే

దేశానికి సేవచేసే అవకాశం వస్తుంది

నిరుద్యోగులు ఆందోళన చెందవద్దన్న కేంద్రమంత్రులు




**న్యూఢిల్లీ, జూన్17(అక్షర వెలుగు):** 'అగ్నిపథ్' పథకం నిరుద్యోగులకు మేలు చేసేదే అని కేందరమంత్రులు ప్రకటించారు. దీనితో ఎలాంటి ఆందోళనలు అసవరం లేదని కేంద్రమంత్రులు అమిత్ షా,రాజ్‌నాథ్ సింగ్‌లు పేర్కొన్నారు. ఆందోళనల పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ట్విట్టర్ వేదికగా స్పందించారు. కోవిడ్-19 మహమ్మారి కారణంగా ఆర్మీ నియామక ప్రక్రియ గత

2

## టీఆర్ఎస్,ఎంఐఎం, కాంగ్రెస్ పార్టీల విధ్వంసం

సికింద్రాబాద్ ఘటనలో కుట్ర: బండి సంజయ్



**హైదరాబాద్, జూన్17(అక్షర వెలుగు):** సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న హింసాత్మక ఘటనలో కటు÷-ర ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆరోపించారు. ఆర్మీ విద్యార్థులకు ఈ సమస్యతో ఎలాంటి సంబంధం లేదని అన్నారు. టీఆర్ఎస్,ఎంఐఎం, కాంగ్రెస్ పార్టీలు కలిసి ఈ విధ్వంసానికి పాల్పడ్డాయని ఆరోపించారు . ఇది అనుకోకుండా జరిగిన సంఘటన కాదని ప్లాన్ ప్రకారమే జరిగిందని అన్నారు. ఇంత జరుగుతుంటే ఇంటెలిజెన్స్ ఏం చేస్తుందని ప్రశ్నించారు. ఆర్మీ విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేయదని, అటువంటి వ్యక్తి నరేంద్ర మోడీ కాదని అన్నారు. కొంతమంది

2

## యూపి, బీహారులో అధికారంలో బిజెపియే ఉంది

అక్కడ అల్లర్లకు ఆ పార్టీయే కారణమా : కొప్పుల



**హైదరాబాద్, జూన్ 17 (అక్షర వెలుగు):** సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో జరిగిన ఘటన తీవ్ర విచారకరమని మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. ప్రధానమంత్రి మోదీ అనాలోచిత నిర్ణయాల వల్ల మొన్న రైతులు, నేడు యువత రోడ్లపైకి రావాల్సి వచ్చిందని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తంచేశారు. సికింద్రాబాద్ ఘటన వెనుక టీఆర్ఎస్ ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ వ్యాఖ్యానించడం సిగ్గుచేటన్నారు. ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖండ్, బీహార్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో యువత పెద్ద సంఖ్యలో రోడ్లపైకి వచ్చి నిరసనలు

2

## సికింద్రాబాద్ ఘటన దురదృష్టకరం

వరంగల్ యువకుడు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం

టిఆర్ఎస్‌పై నిందలు మోపడం దారుణం

బండి సంజయ్ వ్యాఖ్యలు సరికాదన్న మంత్రి ఎర్రబెల్లి



**హైదరాబాద్,జూన్17(అక్షర వెలుగు):** సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఘటన దురదృష్టకరమని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుపేర్కొన్నారు. రైల్వే పోలీసుల కాల్పుల్లో ఓ విద్యార్థి మృతి చెందడం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నానని తెలిపారు. ఈ ఘటనల వెనుక టీఆర్ఎస్ పార్టీ ఉందని బండి సంజయ్ వ్యాఖ్యానించడం సరికాదన్నారు. ఈ ఆరోపణలు ఆయన అజ్ఞానానికి నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. మరి బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో జరుగుతున్న ఆందోళనల వెనుక ఎవరున్నారని అక్కడ టీఆర్ఎస్ ఉన్నదా.. అని ప్రశ్నించారు. ఓటు బ్యాంకు రాజకీయాలు చేసే మూర్ఖపు బీజేపీ నిర్ణయాల వల్ల నేడు దేశ వ్యాప్తంగా అల్లర్లు జరుగుతున్నాయని అన్నారు. బండి సంజయ్ లాంటి నాయకుల వ్యాఖ్యల వల్లే దేశంలో అశాంతి, అభద్రత ఏర్పడిందన్నారు. మొన్న కిసాన్‌ను, నేడు జవాన్‌ను రోడ్డున పడేసిన ఘనత బీజేపీకే దక్కుతుందన్నారు. అగ్నిపథ్ ప్రకటన చేసి.. దేశ రక్షణ కోసం తమ సేవలు అందించాలనుకునే యువతను బీజేపీ ప్రభుత్వం ఘోరంగా అవమానించిందని ధ్వజమెత్తారు. దేశానికి అన్నం పెట్టే

2

## సోనియాకు ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు

ప్రకటన విడుదల చేసిన కాంగ్రెస్ పార్టీ



**న్యూఢిల్లీ, జూన్ 17 (అక్షర వెలుగు):** కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ ఆరోగ్యపరంగా ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కుంటున్నారని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జై రామ్ రమేష్ తెలిపారు. సోనియా గాంధీ ఆరోగ్య పరిస్థితిపై శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఓ ప్రకటనను విడుదల చేసింది. సోనియా ఆరోగ్య పరిస్థితిపై మరింత లోతుగా పర్యవేక్షణ చేస్తూ వైద్యులు చికిత్స అందజేస్తున్నారు. కొవిడ్ ఇన్ఫెక్షన్ కారణంగా ముక్కు నుండి విపరీతంగా రక్తస్రావం కావడంతో సోనియా ఈనెల 12న గంగారామ్ ఆస్పత్రిలో చేరిన విషయం తెలిసిందే. ఆస్పత్రిలో చేరిన వెంటనే కాంగ్రెస్ అధ్యక్షురాలికి వైద్యులు చికిత్స అందించారు. ఈ క్రమంలో సోనియాగాంధీకి దిగువ శ్వాసకోశంలో ఫంగల్ ఇన్ఫెక్షన్ గుర్తించిన వైద్యులు చికిత్స అందజేస్తున్నారు. అలాగే సోనియాగాంధీ ఇతర పోస్ట్ - కోవిడ్ లక్షణాలకు సంబంధించిన చికిత్స కూడా పొందుతున్నారని జైరామ్ రమేష్ వెల్లడించారు.

## కాల్పుల్లో మరణించిన యువకుడు

వరంగల్‌కు చెందిన రాకేశ్‌గా గుర్తింపు

**హైదరాబాద్, జూన్17(అక్షర వెలుగు):** సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో శుక్రవారం సిఆర్పీఎఫ్ జరిపిన కాల్పుల్లో వరంగల్ యువకుడు మృతిచెందాడు. అతడిని ఖానాపురం మండలం దబీర్‌పేటకు చెందిన రాకేశ్‌గా పోలీసులు గుర్తించారు. ఈ మేరకు పోలీసులు రైల్వే అధికారులు సమాచారమిచ్చారు. త్రివిధ దళాల్లో సైనిక నియామకం కోసం కేంద్రం తీసుకొచ్చిన అగ్రిపథ్ స్కీంను నిరసిస్తూ కొంతమంది యువకులు సికింద్రాబాద్ స్టేషన్‌లో ఆందోళనకు దిగారు. రైళ్లను దహనం చేశారు. రాళ్లతో దాడిచేశారు. పరిస్థితి అదుపుతప్పడంతో ఆర్పీఎఫ్ కాల్పులకు దిగింది. పోలీసుల కాల్పుల్లో ఒకరు మృతి చెందగా.. 8 మందికి గాయాలైనట్లు సమాచారం.

## పథకం ప్రకారమే సికింద్రాబాద్ అల్లర్లు

అల్లర్లు అణచివేయడంలో పోలీసుల ప్రేక్షకపాత్ర

మంత్రులు రెచ్చగొట్టేలా వ్యాఖ్యలతో పోస్టులు

అభ్యంతరాలుంటే చర్చించాలే తప్ప విధ్వంసం సరికాదు

ఇష్టమున్న వాళ్లే అగ్నిపథ్‌లో చేరొచ్చు

చాలా దేశాల్లో అగ్నిపథ్ లాంటి పథకం ఉంది

మీడియాతో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



**హైదరాబాద్, జూన్ 17 (అక్షర వెలుగు):**అగ్నిపథ్ పథకం పై కుట్రలు చేస్తున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. యువతను తప్పుదోవ పట్టించేందుకు కొందరు యత్నిస్తున్నారని తప్పుబట్టారు. విధ్వంసం సృష్టించాలనే అలజడులు సృష్టించారని మండిపడ్డారు. దేశభక్తి, జాతీయ భావం పెంచే క్రమంలోనే అగ్నిపథ్ తెచ్చామని తెలిపారు. అనేక దేశాల్లో అగ్నిపథ్ లాంటి పథకాలు ఉన్నాయని గుర్తుచేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నాలుగేళ్ల తర్వాత విధిగా దేశ సేవ చేసే అవకాశం కల్పిస్తామని తెలిపారు. దేశ సేవ చేయాలనుకున్నవారే అగ్నిపథ్‌లో చేరవచ్చన్నారు. ఇది కంపల్సరీ స్కీమ్ కాదని, అగ్నిపథ్ అనేది వాలంటరీ స్కీమ్ అని కిషన్‌రెడ్డి తెలిపారు. మోదీ ప్రధాని కాకముందు నుంచే అగ్నిపథ్‌పై దేశంలో చర్చ జరుగుతోందని పేర్కొన్నారు. అనేక దేశాల విధానాన్ని పరిశీలించాకే అగ్నిపథ్ తీసుకొచ్చామని కిషన్‌రెడ్డి తెలిపారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్

2

## సంపాదకీయం

### కేంద్ర నిర్ణయాలపై నిరుద్యోగుల

# అగ్నిపథం !

ప్రధాని మోడీ ఎనిమిదేళ్లుగా దేశంకోసం తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజలకు ఊరట కలిగించేలా లేవు. అలాగే నిరుద్యోగ సమస్యను పరిష్కరించే ప్రయత్నాలు ఏనాడు చేయలేదు. అంతేగాకుండా ప్రభుత్వరంగ సంస్థలను అనుయాయులకు తెగనమ్మడంతో ఉన్న ఉపాధి ఉద్యోగావకాశాలు పోయాయి. అయినా కళ్లు తెరవని మోడీ తను అనుకున్న రీతిలోనే ముందుకు సాగుతున్నారు. దేశ ప్రయోజనాలు, ప్రజల ప్రయోజనా లపై ఏనాడూ చర్చించకుండా ఎనిమిదేళ్ల పాలనపై ప్రకటనలతో సొంత డబ్బా కొట్టుకుంటున్నారు. జిఎస్టీతో భారీగా వసూళ్లు దండుకుంటున్నారు. గ్యాస్, పెట్రో ధరలతో దోచుకుంటున్నాయి. అయినా నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగాల కల్పనలో శ్రద్ధ చూపడం లేదు. అంతేగాకుండా వివాదాస్పద నిర్ణయాలతో ప్రజల్లో లేని ఆందోళన కలిగిస్తున్నారు. సైనిక నియామకాల కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన అగ్నిపథ్ పథకంపై దేశవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. నాలుగేళ్ల తర్వాత 75 శాతం మందిని నిరుద్యోగులుగా మార్చే ఈ పథకం వద్దని, పాత పద్ధతిలోనే నియామక ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేస్తూ పలు రాష్ట్రాల్లో ఆందోళనలు జరుగుతున్నా..నిమ్మకు నీరెత్తినట్లుగా ఉన్నారు. ఇప్పటికే బిహార్, యూపీలలో పలుచోట్ల ఆందోళనకారులు రైళ్లకు నిప్పుపెట్టారు. తాజాగా సికింద్రాబాద్‌కు కూడా ఆ సెగ పాకింది. కేంద్రం తీసుకుని వచ్చిన అగ్నిపథ్ విధానాన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా పలురాష్ట్రాల్లో నిరుద్యోగ యువత ఆందోళనలు కొనసాగిస్తున్న తీరు ప్రజల్లో ఉన్న అభద్రతను గుర్తు చేస్తోంది. బిహార్, యూపీల్లో.. ఆందోళనలు హింసా త్మకంగా మారాయి. కర్రలతో రైల్వేస్టేషన్లలోకి ప్రవేశించిన ఆందోళనకారులు.. రైల్వే ఆస్తులను ధ్వంసం చేశారు. బిహార్‌లోని లఖీసరాయ్ రైల్వే స్టేషన్‌లో ఓ రైలుకు కొంతమంది దుండగులు నిప్పుపెట్టారు. ఈ ఘటనలో ఐదు కంపార్ట్‌మెంట్లు కాలిపోయాయి. ఆందోళనకారులు నిప్పుపెట్టడంతో రైళ్లోని ప్రయాణికులు భయాందోళనలకు గురైనట్లు పోలీసులు తెలిపారు. వీడియో తీయకుండా ఆందోళనకారులు.. తమ ఫోన్లను లాక్కున్నట్లు స్థానిక పోలీసు సిబ్బంది వెల్లడించారు. బెగూసరాయ్, బెట్టియా ప్రాంతాల్లోనూ ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. కర్రలతో రైల్వేస్టేషన్‌లలోకి ప్రవేశించిన ఆందోళనకారులు.. రైల్వే ఆస్తులను ధ్వంసం చేశారు. ఆందోళనలతో బిహార్‌లో రైళ్లు, బస్సుల రాకపోకలకు అంతరాయం తలెత్తింది. రైల్వే ఆస్తులను ధ్వంసం జరుగుతోంది. కేంద్రం ప్రకటించిన అగ్నిపథ్ పథకం ద్వారా.. 17.5 నుంచి 21 ఏళ్లు మధ్య ఉన్న యువకులు త్రివిధ దళాలలో చేరవచ్చు. ఈ ఏడాదికి మాత్రం గరిష్ఠ వయోపరిమితిని 23 ఏళ్లకు పెంచారు. నాలుగేళ్ల పాటు సేవలు అందించాక వీరిలో 25 శాతం మందికి మాత్రమే సైన్యంలో కొనసాగే అవకాశం ఉంటుంది. ఈ పథకం కింద సైన్యంలో చేరిన వారిని 'అగ్నివీరులు'గా పిలుస్తారు. ఈ ఏడాది మొత్తం 46,000 మంది సైనికులను నియమించనున్నట్లు రక్షణ శాఖ ఇటీవలే ప్రకటించింది. ఈ క్రమంలో సైనిక ఉద్యోగార్థులతో పాటు విపక్షాలు ఆందోళన వ్యక్తం చేశాయి. అగ్నిపథ్ పేరిట నిరుద్యోగు లకు అగ్నిపరీక్ష పెట్టొద్దని కేంద్రంపై విమర్శలు గుప్పించారు. అగ్నిపథ్‌తో తమ జీవితాలతో ఆడుకోవ ద్దంటూ ఆర్మీ అభ్యర్థులు సికింద్రాబాద్ స్టేషన్‌లో బీభత్సం సృష్టించారు. ఒక్కసారిగా విరుచుకుపడిన విద్యార్థులతో రైల్వే స్టేషన్ ప్రాంగణం, ప్లాట్‌ఫారమ్స్‌ల దగ్గర యుద్ధవాతావరణం నెలకొంది. అరగంట పాటు కొనసాగిన ఆందోళనతో రైలు బోగీలు మంటల్లో మాడిమసయ్యాయి. ఓవైపు రెండుకోట్ల ఉద్యోగాలంటూ ప్రకటించిన మోడీ దానిని మరచిపోచారు. తాజాగా అగ్నపథ్‌తో అగ్గి రాజేశారు. ఈ క్రమంలో ఖాళీల భర్తీకి కంటితుడుపుగా రాబోయే ప్దనెనిమిదిమాసాల్లో 10 లక్షల ఉద్యోగాలు భర్తీచేయబోతున్నట్టు ప్రధానమంత్రి కార్యాలయం ఇటీవల ట్వీట్ చేసింది. అన్ని ప్రభుత్వ శాఖల్లో మానవవనరుల స్థితిగతులను సమీక్షించిన తరువాత, యుద్ధప్రాతిపదికన ఏడాదిన్నరలోగా పదిలక్షల ఉద్యోగాలు నింపేయాలని నరేంద్రమోదీ ఆదేశించారన్నది ఆ ట్వీట్ సారాంశం. ప్రభుత్వరంగంలో ఉన్న వివిధ ఖాళీల గురించి మోదీని విపక్షాలు అడపాదడపా ప్రశ్నిస్తున్నా పెద్దగా స్పందిలేదు. నిరుద్యోగ సమస్యపై ఎక్కడా చర్చించలేదు. ఇదే సమయంలో దేశ రక్షణ రంగంలోకి స్వల్పకాలిక కాంట్రాక్టు సైనికులను తీసుకువచ్చే అగ్నిపథాన్ని ఆవిష్క రించడంతో అగ్నివీరులుగా మారవలసిన యువత రైళ్ళనూ బస్సులనూ తగుల బెడుతు న్నందున కాబోలు, మోదీ మిలియన్ ఉద్యోగాల ప్రకటన చేసి ఉంటారు. అయితే ఇదేదీ యువతలో భరోసా నింపేలా కనిపిం చడం లేదు. జాబ్ కాలెండర్ ప్రకటించాలని, ఎన్నికలతో, రాజకీయాలతో సంబంధం లేకుండా అది ఏటా విధిగా అమలవుతూ ఖాళీ అయిన ఉద్యోగాలను భర్తీచేస్తూ పోవాలని ప్రజలు కోరుకుంటున్నారు. మోదీ ఉద్యోగ భర్తీకి సంకల్పించినందుకు నిజానికయితే యువత ఆనందం వ్యక్తం చేయాలి. కానీ ఎనిమిదేళ్లుగా లేని ప్రకటన ఇప్పుడే రావడంతో కాలమంతా గగడిచిపోయింది. అందుకే నిరుద్యో సమస్యపై విపక్షాలు అదే పనిగా విమర్శలు చేస్తున్నాయి. ఎనిమిదేళ్ళక్రితం ఆయన ఎన్నికల ప్రచారంలో ఏటా రెండుకోట్ల ఉద్యోగాలు నింపుతానని ప్రకటించిన విషయాన్ని గుర్తుచేస్తున్నాయి. ఇప్పుడు 10లక్షల ఉద్యోగాలను ఏడాదిన్నరలో నింపబోతున్నామని అంటున్నారు. ఈ ఉద్యోగాల్లో 90శాతం ఖాళీ అయిన కుర్చీలను భర్తీచేసేవే తప్ప, కొత్తగా ఉపాధినిచ్చేవి కావు. దేశాన్ని కాపాడవలసిన సైనికుడిని కూడా నాలుగేళ్ళు ఉద్యోగంలో ఉంచి, ఆ తరువాత ఓ నాలుగురాళ్ళు చేతికిచ్చి పంపించేస్తానని చెబుతున్న ప్పుడు ఈ ప్రభుత్వం స్వల్పకాలిక ఉపాధితో మభ్య పెడుతుందన్నది యువత గమనించి ఆందోళలకు పూనుకుం టోంది. ఇంకా యువతను, దేశప్రజలను మభ్యపెట్టడం కుదరదని బిజెపి శ్రేణులు గుర్తిస్తే మంచిది.

**పృధ్విరాజ్ గోసుకొండ**
ఎడిటర్

# రణరంగంగా మారిన సికింద్రాబాద్ స్టేషన్

- అగ్నిపథ్ ఆందోళనకారుల దాడితో బుగ్గి ● పలు రైళ్లకు, బోగీలకు, వాహనాలకు నిప్పు
- దాడులతో వాహనాలు ధ్వంసం..ప్రయాణికుల పరుగు ● పోలీస్ కాల్పుల్లో ఇద్దరు మృతి..పలువురికి గాయాలు
- ● అల్లర్లతో సంబంధం లేదన్న ఎన్ఎస్‌యూఐ నేత బల్మూరి వెంకట్

**హైదరాబాద్, జూన్17(అక్షర వెలుగు):** సికింద్రాబాద్ స్టేషన్ రణరంగంగా మారింది. అగ్నిపథ్‌తో తమ జీవితాలతో ఆడుకోవద్దంటూ ఆర్మీ అభ్యర్థులు సికింద్రాబాద్ స్టేషన్‌లో బీభత్సం సృష్టించారు. ఒక్కసారిగా విరుచుకు పడిన విద్యార్థులతో రైల్వే స్టేషన్ ప్రాంగణం, ప్లాట్‌ఫారమ్స్‌ల దగ్గర యుద్ధవాతావరణం నెలకొంది. అరగంట పాటు కొనసాగిన ఆందోళనతో రైలు బోగీలు మంటల్లో మాడిమసయ్యాయి. పరిస్థితిని అదుపులోకి తీసుకుని వచ్చేందుకు రైల్వే స్టేషన్‌లో ఆందోళనకారులపై పోలీసులు 15 రౌండ్ల కాల్పులు జరిపారు. పోలీసుల కాల్పుల్లో ఆందోళనకారులకు గాయాలయ్యాయి. ఈ కాల్పుల్లో ఇద్దరు మృతిచెందారు. ఆందోళనకారుల దాడిలో పార్సిల్ కార్యాలయంలో ఉన్న బైకులు, ఇతర సామన్లు అగ్నికి ఆహుతి అయ్యాయి. రైల్వేట్రాక్, ఫ్లాట్‌ఫామ్‌లు గందరగోళంగా మారిపోయాయి. వందల కోట్ల రూపాయల ఆస్తి నష్టం జరిగింది. ఏం జరుగుతుందో తెలియక అక్కడికి వచ్చిన ప్రయాణికులు ప్రాణభయంతో పరుగులు తీశారు.అగ్నిపథ్‌కు వ్యతిరేకంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో జరిగిన ఆందోళనలు తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. ఆందోళనకారులు స్టేషన్‌లో విధ్వంసానికి పాల్పడ్డారు. పోలీసులపై రాళ్లదాడికి దిగారు. దీంతో పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో పలువురు గాయపడ్డారు. ఇద్దరు మృతి చెందగా ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నది. గాయపడిన వారిని గాంధీ దవాఖానకు తరలించారు. ఆందోళనకారుల దాడిలో మూడు రైళ్లు ధ్వంసం అయినట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. పార్శిల్ రైలుతో పాటు అజంతా ఎక్స్‌ప్రెస్‌లో 2 బోగిలు దగ్ధం అయ్యాయని, 40 బైక్‌లు కూడా ధ్వంసం చేశారని రైల్వే సీపీఆర్వో రాకేష్ వెల్లడించారు. 44 ఎమ్ఎమ్‌టీఎస్ రైళు రద్దుచేసినట్లు తెలిపారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ఆందోళనకారులపై పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించారు. అలాగే రైల్వేస్టేషన్‌లో అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. గాయపడిన వారిని గాంధీ ఆసుపత్రికి తరలించారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ రక్తసిక్తంగా మారింది. పోలీసులపై ఆందోళనకారులు రాళు రువ్వారు. అయితే సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఘటనకు ఎన్ఎస్‌యూఐకి ఎలాంటి సంబంధం లేదని ఎన్ఎస్‌యూఐ నేత బల్మూరి వెంకట్ తెలిపారు. ఎన్ఎస్‌యూఐ చేస్తుందని మీడియాలో వస్తున్న వార్తలు అవాస్తవమని పేర్కొన్నారు. ఆర్మీ అభ్యర్థుల ఆకస్మిక దాడితో పోలీసులు ఏమీ చేయలేకపోయారు. ఏం జరుగుతుందో తెలిసేలోపే సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ అగ్నిగుండంగా మారింది. రెండు గంటల నుంచి రైల్వేస్టేషన్‌లో విధ్వంసకాండ కొనసాగుతోంది. మూడు ప్లాట్‌ఫామ్‌లలో నిరసనకారులు బీభత్సం సృష్టించారు. 20 బైక్‌లకు నిప్పు పెట్టారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వద్ద విద్యార్థులు బైఠాయించారు. అగ్నిపథ్‌ను రద్దు చేయాలంటూ వందల మంది ఆర్మీ అభ్యర్థులు విధ్వంసానికి దిగారు. ప్యాసింజర్ రైలు, పార్మీల్ బోగీలకు, స్టాళ్లకు ఆర్మీ అభ్యర్థులు నిప్పు పెట్టారు. రైళ్లపై రాళ్లు విసరడంతో భయంతో ప్రయాణికులు పరుగులు తీశారు. ఆర్మీ అభ్యర్థుల దాడిలో పలువురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేస్తున్నారు. పరిస్థితి చేయిదాటడంతో సికింద్రాబాద్ స్టేషన్‌లో అన్ని రైళ్లను అధికారులు నిలిపేశారు. రైల్వేస్టేషన్ వద్ద ఆర్టీసీ బస్సులను కూడా ఆందోళనకారులు ధ్వంసం చేశారు. అగ్నిపథ్ ఆందోళన హైదరాబాద్‌కు పాకింది. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ వద్ద పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అగ్నిపథ్‌ను రద్దు చేయాలంటూ రైల్వే స్టేషన్ బయట ఉన్న ఆర్టీసీ బస్సులను ఆర్మీ అభ్యర్థులు ధ్వంసం చేశారు. అంతటితో ఆగకుండా రైల్వే స్టేషన్‌లోకి చొచ్చుకెళ్లిన ఆందోళనకారులు.. ప్లాట్‌ఫారమ్ మీద ఉన్న రైళ్లపై కూడా రాళ్లు విసిరారు. ఇక నిరసనకారుల ఆందోళనతో అధికారులు రైళ్లను నిలిపివేశారు.



## దేశంలో నిరుద్యోగ సంక్షోభం తీవ్రం

(మొదటి పేజీ తరువాయి) అగ్నివీర్ స్కీమ్‌ను వ్యతిరేకిస్తూ జరుగుతున్న ఆందోళనలు ఆ తీవ్రతను సూచిస్తున్నాయని మంత్రి కేటీఆర్ తన ట్విట్టర్‌లో తెలిపారు. తొలుత దేశ రైతులతో కేంద్ర ప్రభుత్వం ఆడుకుందని, ఇప్పుడు దేశ జవాన్లతోనూ ఆడుకుంటోందని మంత్రి ఆరోపించారు. వన్ ర్యాంక్ వన్ పెన్షన్ విధానం నుంచి ఇప్పుడు దేశంలో నో ర్యాంక్ నో పెన్షన్ గా మారిందని మంత్రి కేటీఆర్ తన ట్విట్టర్‌లో కేంద్ర వైఖరిని విమర్శించారు.

# శంషాబాద్‌లో బంగారం పట్టివేత

(మొదటి పేజీ తరువాయి) నుంచి రూ.28.52లక్షల విలువైన 554.20 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆ ప్రయాణికుడు.. ఎయిర్‌పోర్టు వీఏఆర్ ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ సర్వీస్‌కు చెందిన ప్రైవేట్ ఉద్యోగి ద్వారా ఈ బంగారాన్ని స్మగ్లింగ్ చేసేందుకు యత్నించాడు. గాజులు, గొలుసులు, బిస్కెట్ల రూపంలో బంగారాన్ని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పథకం ప్రకారమే సికింద్రాబాద్ అల్లర్లు

(మొదటి పేజీ తరువాయి) దుర్ఘటన దురదృష్టకరం. ఉదయం నుంచి విధ్వంసం సృష్టిస్తుంటే.. పోలీసులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు. రైల్వేస్టేషన్ ఘటన ఉద్దేశపూర్వంగా జరిగిందే. ఘటనలో వ్యక్తి మృతి బాధాకరం. శాంతిభద్రతలు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని అంశం. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ జరపాలి. హింస జరుగుతుంటే రెచ్చగొట్టేలా ఓ మంత్రి వ్యాఖ్యలు చేశారు. అగ్నిపథ్ స్కీమ్‌పై అనుమానాలు ఉంటే నివృత్తి చేసుకోవాలి. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ వచ్చినవారంతా ఏమైనా సైన్యంలో చేరేవారా? వన్ ర్యాంక్.. వన్ పెన్షన్ అమలు చేస్తున్నాం' అని కిషన్‌రెడ్డి తెలిపారు. అగ్నిపథ్ వాలంటరీ స్కీం అని, అందులో చేరేందుకు ఎలాంటి బలవంతం లేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. అగ్నిపథ్ కు వ్యతిరేకంగా కొంత మంది కుట్రపూరితంగా ఆందోళన చేపట్టారని ఆరోపించారు. స్టేషన్ ప్లాట్ ఫామ్స్, ట్రెయిన్స్, ఇతర ఆస్తులను ఆందోళనకారులు ధ్వంసం చేశారన్నారు. షాపులను లూటీ చేశారని, ఆందోళనకారుల దాడులతో ప్రాసింజర్లు సామాన్లు వదిలేసి ప్రాణభయంతో పారిపోయిన పరిస్థితి నెలకొందని చెప్పారు. ఇది ఏమాత్రం అమోదయోగ్యం కాదని, చాలా దురదృష్టకరమని వాపోయారు. స్కీంపై ఏమైనా అభ్యంతరాలుంటే ప్రజాస్వామ్యబద్ధంగా చర్చించాలని మంత్రి సూచించారు. దేశ రక్షణకు సంబంధించి భారత్ కూడా ఈ స్కీంను చేపట్టిందని మంత్రి వెల్లడించారు. ఉదయం నుంచి నిరసనకారులు విధ్వంసం చేస్తోంటే పోలీసులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారని మండిపడ్డారు. శాంతి భద్రతలకు ఈ స్థాయిలో విఘాతం కలుగుతున్నా... రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తోందని ఫైర్ అయ్యారు. ఆందోళనను కట్టడి చేయాల్సిన రాష్ట్ర మంత్రులు... సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ రెచ్చకొడుతున్నారని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకొని ఆందోళనను ఆపాలని కోరారు. సమగ్రమైన దర్యాప్తు చేసి ఆందోళనకు కారణమైనవారిపై చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు.

## టీఆర్ఎస్,ఎంఐఎం, కాంగ్రెస్ పార్టీల విధ్వంసం

(మొదటి పేజీ తరువాయి) తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని, వారి మాటలు వినొద్దని సూచించారు. రాష్ట్రంలో శాంతిభద్రతాలు క్షీణించాయని, ప్రభుత్వమే విద్వాంసాలను పెంచిపోషిస్తుందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వాన్ని బద్నాం చేద్దామనే లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం వ్యవహిరిస్తుందని సంజయ్ ఫైర్ అయ్యారు.

# జగిత్యాలకు బిసి స్టడీ సర్కిల్

### హర్షం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే సంజయ్



**జగిత్యాల, జూన్ 17 (అక్షర వెలుగు):** జిల్లాకు బీసీ స్టడీ సర్కిల్ మంజూరు కావడంపై ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ హర్షం వ్యక్తంచేశారు. స్టడీ సర్కిల్ మంజూరుకు కృషిచేసిన బీసీ సంక్షేమ శాఖా మంత్రి గంగుల కమలాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్ 1,2,3,4, ఇతర ఉద్యోగాలకు పోటీ పడుతున్న అభ్యర్థుల కోసం ఉచిత కోచింగ్ ఇస్తూ స్టడీ మెటీరియల్ కూడా అందజేస్తారని చెప్పారు. ప్రస్తుతం జిల్లాకు మంజూరైన బీసీ స్టడీ సర్కిల్ మోతె రోడ్డులోని తన సొంత భవనంలో నడుస్తుందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. శిక్షణ తీసుకునే అభ్యర్థులకు ఉచిత వసతి, భోజనం ఉంటుందని వెల్లడించారు. రాయికల్,జగిత్యాల పట్టణాలకు చెందిన అభ్యర్థులు మున్సిపల్ కమిషనర్లకు, జగిత్యాల అర్బన్, రూరల్, సారంగా పూర్, బీర్‌పూర్, రాయికల్ మండల అభ్యర్థులు ఎంపీడీవోలకు దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. పూర్తి వివరాల కోసం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి సంక్షేమ శాఖ కార్యాలయంలో లేదా 9603681993 , 8341033333 మొబైల్ నంబర్లలో సంప్రదించవచ్చని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ వెల్లడించారు.

## ఆందోళనకారులను చర్చలకు ఆహ్వానించిన పోలీసులు

**హైదరాబాద్, జూన్17(అక్షర వెలుగు):** సికింద్రాబాద్ స్టేషన్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. అగ్నిపథ్ స్కీంకు వ్యతిరేకంగా చేపట్టిన ఆందోళనను స్పష్టమైన హామీ వచ్చే వరకు విరమించే ప్రసక్తేలేదని నిరసనకారులు అంటున్నారు. ఈ క్రమంలో పోలీసులు వారిని చర్చలకు ఆహ్వానించారు. 10 మంది ఆందోళనకారుల్ని చర్చలకు పిలిచారు. వారిని ఆర్మీ రిక్రూట్‌మెంట్ ఆఫీసర్ వద్దకు తీసుకెళ్తామని అన్నారు. అయితే ఆందోళనకారులు మాత్రం ఆర్మీ రిక్రూట్‌మెంట్‌అధికారి వద్దకు అందరం వస్తామని పట్టుబట్టారు. లేనిపక్షంలో అధికారినే తమ వద్దకు తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు. అందుకు నిరాకరించిన పోలీసులు అరగంటలో చర్చలకు రావాలని స్పష్టం చేశారు. మరోవైపు ఆందోళనకారుల్ని పోలీసులు నలువైపులా చుట్టుముట్టారు. హింసాత్మక ఘటనలకు పాల్పడితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా సికింద్రాబాద్ స్టేషన్ వద్ద భారీగా సీఆర్పీఎఫ్, ఆర్పీఎఫ్ బలగాలు మోహరించారు.

## అగ్నిపథ్ పథకం నిరుద్యోగులకు మేలు చేసేదే



(మొదటి పేజీ తరువాయి) రెండేళ్లుగా ఆగిపోయింది. అందువల్లే ప్రధాని నరేంద్ర మోడీ అగ్నిపథ్ అనే స్కీమ్ ని తీసుకువచ్చి అభ్యర్థుల వయసు పరిమితిని రెండేళ్లు పెంచారు. 2022 కి సంబంధించి గరిష్ఠ వయోపరిమితిని 21 ఏళ్ల నుంచి 23 ఏళ్లకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. దీనివలన చాలా మంది యువతకు లబ్ది కలుగుతుంది. అగ్నిపథ్ పథకం ద్వారా యువత దేశానికి సేవ చేయవచ్చు, వారు ఉజ్వల భవిష్యత్తు దిశగా ముందుకు సాగుతారు.మోడీకి దన్యవాదాలు అని ట్వీట్ చేశారు. దేశవ్యాప్తంగా తీవ్ర స్థాయిలో నిరసన జ్వాలలు ఎగసిపడుతున్న వేళ రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన అగ్నిపథ్ పథకం విషయంలో ముందుకే వెళ్తామని స్పష్టం చేశారు. రక్షణ దళాల్లో చేరి దేశానికి సేవ చేయాలనుకుంటున్న యువతకు అగ్నిపథ్ పథకం ఒక 'సువర్ణావకాశం' అని ఆయన వ్యాఖ్యానించారు. అగ్నిపథ్ పాలసీ కింద ఎంపికైనవారిని 'అగ్ని వీరులు'గా గుర్తిస్తామని, నాలుగేళ్లపాటు సాయుధ బలగాల్లో వారు పనిచేయవచ్చునని సూచించారు. త్వరలోనే అగ్నిపథ్ నియామక ప్రక్రియ ఆరంభమవుతుందని తేల్చిచెప్పారు. ఇందుకు అనుగుణంగా సన్నద్ధమవ్వాలని యువతకు రాజ్‌నాథ్ సింగ్ పిలుపునిచ్చారు. గత రెండేళ్లలో నియామకాలు చేపట్టనందున సైన్యంలో చేరాలనుకునేవారికి ఇది చక్కటి అవకాశమని రాజ్‌నాథ్ అన్నారు. నియామకాలు చేపట్టని కారణంగా యువత భవిష్యత్ దృష్ట్యా అభ్యర్థుల వయోపరిమితిని 21 ఏళ్ల నుంచి 23 ఏళ్ల సంవత్సరాలకు సడలిస్తూ ప్రధాని నరేంద్ర మోడీ మినహాయింపునిచ్చారని పేర్కొన్నారు. అయితే ఈ సడలింపు ఈ ఒక్కసారికి మాత్రమే వర్తిస్తుందని స్పష్టం చేశారు. యవతకు ఉపశమనం కల్పించిన ప్రధాని మోడీకి యువకుల తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నానని వ్యాఖ్యానించారు. కాగా రాజ్‌నాథ్ సింగ్ రెండు రోజుల జమ్ముకాశ్మీర్ పర్యటనలో ఉన్నారు.

## యూపి, బీహారుల్లో అధికారంలో బిజెపియే ఉంది

(మొదటి పేజీ తరువాయి) తెలుపుతున్నదని, ఈ ఘటనల వెనుక కూడా టీఆర్ఎస్సే ఉందా? అని మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రశ్నించారు. ఆ రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నది బీజేపీనే కదా? అని అడిగారు.ఓ బాధ్యతగల ఎంపీ అనే విషయం మరువొద్దని, అర్థంపర్థం లేకుండా నోటికొచ్చినట్లు మాట్లాడి నవ్వులపాలు కావొద్దని బండి సంజయ్‌కి హితవు పలికారు. అగ్నిపథ్ పథకంపై దేశవ్యాప్తంగా యువత నిరసన తెలుపుతున్నందున.. దీనిపై పునరాలోచన చేయాలని ప్రధాని మోడీని మంత్రి కొప్పుల ఈశ్వర్ కోరారు. బీజేపీ సర్కారు ఒకపక్క ప్రభుత్వరంగ సంస్థలను తమ మిత్ర కార్పొరేట్ శక్తులకు అమ్ముతూ..మరో పక్క పెట్రోల్, డీజిల్ ,గ్యాస్ సిలిండర్ రేట్లు పెంచి లక్షల కోట్లు అక్రమంగా ఆదాయం పొందుతున్నదని మండిపడ్డారు. దేశ రక్షణను మాత్రం గాలికి వదిలేసి బేరాలాడుతూ ఖర్చుకు వెనుకాడుతున్నదని విమర్శించారు. 'అగ్నిపథ్ పథకం' తెచ్చి దేశ రక్షణ కోసం తమ సేవలు అందించాలనుకునే ఆసక్తిగల దేశ యువతను బీజేపీ ఘోరంగా అవమానిస్తోందన్నారు. దేశాన్ని సాకే రైతన్నలు, దేశానికి రక్షణగా నిలిచే సైనికులను నిర్లక్ష్యంగా చూడడం హేయమైన చర్య అని మంత్రి వ్యాఖ్యానించారు. ఈ అల్లర్ల వెనుక టీఆర్ఎస్ ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆరోపణలు చేయడం ఆయన అజ్ఞానానికి నిదర్శనమని మండిపడ్డారు.

# బాసర వెళ్లకుండా బండి సంజయ్ అరెస్ట్

### కల్వకుంట్ల రాజ్యాంగం నడుస్తోందని ఆరోపణ



**కామారెడ్డి, జూన్17(అక్షర వెలుగు):** రాష్ట్రంలో కల్వకుంట్ల రాజ్యాంగం నడుస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. బాసర ట్రిపుల్ ఐటీకి వెళు న్న బండిని బిక్కనూర్ టోల్ ప్లాజా వద్ద పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేశారు. ఈ క్రమంలో పోలీస్ స్టేషన్‌లో బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ... ట్రిపుల్ ఐటీ విద్యార్థుల సమస్యలను సిల్లీ అని తీసేసిన సిల్లీ సీఎం ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. సమస్యలు పరిష్కరించాలని ఆందోళన చేస్తున్న విద్యార్థులను పోలీసులతో బెదిరిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఒక్క ట్రిపుల్ ఐటీని మెయింటెన్ చేయని సీఎం మిగతా విద్యాసంస్థలను ఏం మెయింటెన్ చేస్తారని ఆయన నిలదీశారు. ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ఏమైనా ఉగ్రవాదులా.. టెర్రరిస్టులా అని అన్నారు. నాలుగు రోజులుగా ఆందోళన చేస్తున్నా సీఎం ఎందుకు స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు భరోసా కల్పించేందుకే తాము ట్రిపుల్ ఐటికి వెళ్తున్నామని తెలిపారు. అక్కడ ఆందోళనలు, ధర్నాలు చేయడానికి మాకేమైన సీఎం మాదిరిగా పనిపాట లేదా అని అన్నారు. పోలీసుల నిర్బంధంతో అడ్డుకుంటున్నారని... బీజేపీని ఆపడం సీఎం తాతతరం కూడా కాదని బండి సంజయ్ స్పష్టం చేశారు.

# ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

### బస్తీ దవఖానాను ప్రారంభించిన మంత్రి ఇంద్రకరణ్



**నిర్మల్, జూన్17(అక్షర వెలుగు):** ప్రజల ఆరోగ్యానికి సీఎం కేసీఆర్ అధిక ప్రాధాన్యమిస్తున్నారని మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. ప్రజలకు చేరువగా వైద్య సౌకర్యాలను తీసుకుని వస్తున్నామని అన్నారు. త్వరలోనే హెల్త్ ప్రొఫైల్ కూడా చేపట్టబోతున్నామని అన్నారు. నిర్మల్ పట్టణం ఓల్డ్ బస్టాండ్ ఏరియాలో నూతనంగా నిర్మించిన బస్తీ దవాఖానను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణ పేదలకు మరింత దగ్గరగా వైద్యం అందించాలని ముఖ్యమంత్రి నిర్ణయం మేరకు నేడు బస్తీ దవాఖానలు ప్రారంభించామన్నారు. దీంతో ఇక్కడి పేద ప్రజలకు ఆరోగ్య సేవలు మరింత అందుబాటులోకి రానున్నాయని చెప్పారు. బస్తీ దవాఖానల్లో అవుట్ పేషెంట్ సేవలు అందించడంతో పాటు స్వల్పంగా అనారోగ్యం బారిన పడిన వారికి తక్షణ వైద్య చికిత్స అందిస్తారన్నారు. అదేవిధంగా టీకాలు, కుటుంబ నియంత్రణ, వైద్య పరమైన కౌన్సిలింగ్ ఇస్తారని తెలిపారు.ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి వ్యాయామం, యోగ లాంటివి చేసి శారీరకంగా దృఢంగా ఉండాలని సూచించారు. గతంలో ఏజెన్సీ ప్రాంతాల్లో విషజ్వరాలు ప్రబలి గిరిజన ప్రజలు మరణించేవారని, తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత వైద్య సేవలు మెరుగుపడ్డాయని, సీజనల్ వ్యాధులు, విష జ్వారాల వల్ల మరణాలను పూర్తి నిరోధించగలిగమని పేర్కొన్నారు. పచ్చదనం పరిశు భ్రతకు పెద్దపీట వేస్తూ.. ప్లలె, పట్టణ కార్యక్రమాలు చెపట్టామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో చేపట్టిన అభివృద్ధి పనులు, ఏంఏం సమస్యలను పరిష్కరించ గలిగాము? రానున్న రోజుల్లో పరిష్కారించాల్సిన సమస్యలు ఏంటని అధికారులు, ప్రప్రతినిధులు సమీక్ష చేసుకోవాలని సూచించారు.

# సికింద్రాబాద్ ఘటన దురదృష్టకరం



(మొదటి పేజీ తరువాయి) రైతన్నలను, మనకు రక్షణగా నిలిచే సైనికులను కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా చూడటం సరికాదని మంత్రి పేర్కొన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఘటన దురదృష్టకరమని, ఆ ఆందోళనలో మృతి చెందిన యువకుడు వరంగల్ జిల్లా ఖానాపురం మండలం దబీర్‌పేటకు చెందిన రాకేశ్ గా తేలడం, పలువురు గాయపడటం ఆవేదన కలిగిస్తున్నదని మంత్రి పేర్కొన్నారు. ఈ ఘటన పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులను మంత్రి ఆదేశించారు. మృతుల కుటుంబాలకు, క్షతగాత్రులకు ఎక్స్ గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఒక ఆనాలోచిత, ఆపరిపక్వ, అసంబద్ధ ఆలోచన వల్ల ఈ అనర్థాలు జరుగుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. దేశాన్ని రక్షించే త్రివిధ దళాలలో కొత్తగా యువతను తీసుకోవడానికి తెచ్చిన అగ్నిపథ్ పథకమే అర్థంలేని విధంగా ఉంది. దేశ స్థాయిలో కేవలం 46 వేల మందిని తీసుకోవడానికి ఇంత పెద్ద రాద్ధాంతం అవసరమా? పైగా 90 రోజులలో నియామకం, కేవలం రూ.30 వేల జీతం, 4 ఏండ్ల లో మళ్ళీ పరీక్ష పెట్టి, అందులో ఉత్తీర్ణులైన వారికే అవకాశం అన్నారు. 10వ తరగతి పాసైన విద్యార్థులను తీసుకుని, ఉద్యోగాలు రాని వారికి 4 ఏండ్లకు ఇంటర్ సర్టిఫికేట్ ఇస్తామనడం విడ్డూరంగా వుందన్నారు. మొన్న నల్ల వ్యవసాయ చట్టాలతో రైతుల, ఇవ్వాళ అగ్నిపథ్ లాంటి నిర్ణయాలతో కేంద్రం యువత ఉసురు పోసుకుంటున్నాదని ఆరోపించారు. ఇంతా చేసి, అల్లర్లలో పార్టీల పాత్ర ఉందన్న అనుమానాలు వ్యక్తం చేస్తూ యువతను అవమానిస్తున్నారన్నారు. దేశ వ్యాప్తంగా జరుగుతున్న అన్ని ఆందోళనల వెనుకా పార్టీలే ఉన్నాయా? కేంద్రంలో బిజెపి చేతగాని తనాన్నిపార్టీల మీద రుద్దడం న్యాయమా? మోడీ పాలనలో దేశంలో నిరుద్యోగ శాతం 5.6 శాతం నుండి 7.83 శాతానికి పెరిగిందని మంత్రి ఎర్రబెల్లి అన్నారు.

శని వారం / 18. 6. 2022
www.aksharavelugu.com
అక్షర వెలుగు
తెలుగు దిన పత్రిక


## ఓ కుటుంబం రోడ్డున పడటం అర్థం చేసుకుందాం బాద్యతగావ్యవహరిద్దాం

యాక్సిడెంట్ అంటే ఓ బైకో, కారో రోడ్డు మీద పడటం కాదు : రోహిణి ప్రియదర్శిని ఐ.పి.ఎ.స్



**మెదక్, జూన్17(అక్షర వెలుగు):** మెదక్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పి శ్రీమతి రోహిణి ప్రియదర్శిని ఐ.పి.ఎ.స్ గారు మాట్లాడుతూ....యాక్సిడెంట్ అంటే ఓ బైకో, కారో రోడ్డు మీద పడటం కాదు ఓ కుటుంబం రోడ్డు న పడటం అని అన్నారు. అలాగే రహదారుపై తెలుపు గీతలు.. పసుపు లైన్లు.. సంజ్ఞలు.. సంకేతాలు... రోడ్డుపై మనకు రకరకాల రేఖలు కనిపిస్తుంటాయి... చాలామందికి వీటి అర్థం తెలియదు.. కొందరైతే అసలు పట్టించుకోరు... కానీ ఈ ప్రతి గీతకో పరమార్థం ఉందనే సంగతి మీకు తెలుసా? ఆ అర్థం అవగతం చేసుకుంటే ప్రమాదాలు జరగకుండా మన తలరాతను మార్చే శక్తి వీటికుందిని వాటి గురించి వివరిస్తూ...తెలుపు: అన్నీ రకాల సంకేతాలకు తెలుపు రంగు వాడతారు.పసుపు రంగు: అవరోదాలు ఉన్నాయి అనడానికి సంకేతం నలుపు: తెలుపునకు ప్రత్యామ్నాయం.పాదాచారుల కాళి బాటకు ఎక్కువగా వాడతారు బ్రోకెన్ తెలుపు గీతలు దేశంలో అత్యధికంగా కనిపించే రోడ్డు మార్కింగ్. దీనర్థం వాహనదారుడు రోడ్డు మీద వెళ్తుంటే కావాలనుకున్నప్పుడు వరుసలు మారొచ్చు ముందున్న వాహనాలను ఓవర్‌టేక్ చేయొచ్చు యూటర్న్ తీసుకోవచ్చు అని అర్థం. అయితే ఇవన్నీ చేసేముందు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. వెనకాముందు చూడాలి అని ఈ గీత చెబుతుంది. ఏకధాటి (సాలిడ్) తెలుపు గీతలు ముందున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేయొద్దు యూటర్న్ తీసుకోవద్దు అని ఈ రేఖ చెబుతుంది. అంటే ముందు ప్రమాదకర పరిస్థితులున్నాయి.. వెలుతురు సరిగా లేదు.. అని. అయినా ఈ రోడ్డు నుంచి బయటికి వెళ్లాలి, రెండు వరుసల పసుపు గీతలు దీనర్థం ఎట్టి పరిస్థితుల్లోనూ వరుస మారొద్దు ముందు వాహనాల్ని దాటొద్దు ఏదైనా అతిపెద్ద అడ్డంకి ఉంటే తప్ప కూడలిలో సిగ్నళ్లు పడినప్పుడు మాత్రమే రోడ్డు దాటాలి. వెడల్పు తక్కువగా ఉండే రెండు వరుసల రహదారికి మాత్రమే ఇలాంటి గీతలు వాడతారు. పసుపు గీత పక్కన బ్రోకెన్ పసుపు రేఖ ఇందులో రెండు అర్థాలున్నాయి. బ్రోకెన్ లైన్ వైపు మనం ఉంటే ముందు వెళ్తున్న వాహనాన్ని దాటుకొని వెళ్లవచ్చు సాలిడ్ పసుపురంగు గీత వైపు డ్రైవింగ్‌లో ఉంటే ఓవర్‌టేక్ చేయడానికి వీల్లేదు.స్టాప్ లైన్: ఆ గీత కన్నా ముందే ఆగిపోవాలి. వాహనాన్ని ముందు ఆపాలి. గివ్ అవే లైన్: తిరగేసిన త్రిభుజాకారపు గుర్తు. రెండు వరుసల చుక్కల లైన్లు జంక్షన్ల దగ్గర కనిపిస్తాయి. మనం నడిపే వాహనం ప్రధాన రహదారిపైకి వస్తున్నప్పుడు అటూఇటూ చూసుకొని వాహనాలకు, ట్రాఫిక్‌కి అడ్డుపడకుండా వెళ్లాలి. బోర్డర్ ఎడ్జ్ లైన్స్: రహదారి ముగిసేవరకూ ఇవి ఉంటాయి. సాధారణంగా తెలుపు రంగులో వేస్తారు. వాహనాలు ఈ గీతను దాటి బయటికి వెళ్లడం ప్రమాదకరం అని చెప్పడమే దాని ఉద్దేశం. ఒకవేళ వాహనాన్ని పార్క్ చేయాల్సి వస్తే ఈ గీతకి బయటే నిలపాలి. ఎల్లో బాక్స్ జంక్షన్: రోడ్డు మధ్యలో ఇంటర్ సెక్షన్‌లో వేస్తారు. దీనిపై నుంచి ఇరుపక్కల ద్వారా వాహనాలు వెళ్లొచ్చు ఇతర అడ్డంకులేమీ లేనప్పుడు, వేరే వాహనాలు బాక్స్ గుండా వెళ్లనప్పుడు మాత్రమే ఈ బాక్స్ ద్వారా మలుపు తీసుకోవచ్చు. పెడెస్ట్రియన్ క్రాసింగ్: వీటినే జీబ్రా క్రాసింగ్ అంటుంటారు. నలుపు, తెలుపుల స్ట్రిప్‌లతో గుర్తులు వేస్తారు. సాధారణంగా కూడళ్లలో ఈ గుర్తులుంటాయి. సిగ్నల్ పడ్డప్పుడు పాదచారులు తప్పకుండా వీటి ద్వారానే రోడ్డు దాటాలి. ఆ సమయంలో చోదకులు వాహనాలను ఆపేయాలి. రంబుల్ స్ట్రిప్‌లు: పట్టీల్లా రోడ్డుపై కొంచెం ఉబ్బెత్తుగా వేసే గీతలివి. వాహనాలు వీటిపై నుంచి వెళ్తుంటే చిన్నపాటి శబ్దం వస్తుంది. నిద్రమత్తులో, పరాకుగా ఉన్న డ్రైవర్లను అప్రమత్తం చేయడానికే ఈ ఏర్పాటు. నిబంధనలు పాటిస్తే, రోడ్డు గీతలపై అవగాహన ఉంటే ప్రయాణం భద్రంగా ఉంటుంది. ప్రమాదాలు తగ్గడానికి ఆస్కారం. ఎక్కడ ఆపాలో, ఎక్కడ పార్కింగ్ చేయాలో, ఎక్కడ యూటర్న్ తీసుకోవాలో చిన్న చిన్న సమాచారం సైతం తేలిగ్గా తెలుస్తుంది. ఇరుకు రోడ్లు, వంతెనలు, మలుపులు.. ఇలాంటి అడ్డంకులను సైతం తెలియజేస్తూ ప్రమాదాలను నివారిస్తాయి. కాబట్టి ప్రతి వాహనదారుడు రంగుల గీతాలను వాటి సంకేతాలను తెలుసుకుని వాటికి అనుగుణంగా తమ వాహనాలను నడపటం వల్ల రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని అన్నారు.

## సింగూరు జలాల ముంపుకు గురౌతున్న దళితుల భూములు



**అందోల్, జూన్17(అక్షర వెలుగు):** అందోల్ నియోజకవర్గం పరిధి లో వట్టిపల్లి మండలం ఖాదిరాబాద్ గ్రామానికి చెందిన కొంతమంది దళితులకు సంబంధించిన (భూమిని సర్వే నం 26) ఆందోల్ నియోజకవర్గ పరిధిలోని సర్వే (7) సాయిపేట గ్రామానికి తెలంగాణ గ్రామ క్రీడా మైదానం ఆట స్థలంకు కేటాయించారు. ఈ స్థలం సింగూరు ప్రాజెక్టుకు ముంపుకు గురి అవుతుంది అంతే కాకుండా దళితులకు పట్టా భూమి కావడంతో సంబంధిత దళిత కుటుంబాలు వట్టిపల్లి మండలం తహాశిల్దార్ గారికి వినతి పత్రాన్ని అందజేశారు. తమకు న్యాయం జరగకపోతే భవిష్యత్తులో ఉద్యమం చేస్తామని హేచ్చరించారు. ఈ కార్యక్రమంలో వటపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్ జోషి ఉమ్మడి మండలాల దళిత నాయకులు సంఘాల తలారి దేవరాజ్ మరియు యువజన కాంగ్రెస్ నాయకులు దళిత యువజన సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవాలి


రోహిణి ప్రియదర్శిని ఐ.పి.ఎ.స్



**మెదక్, జూన్17(అక్షర వెలుగు):** మెదక్ జిల్లా న్యాయస్థానంలో జాతీయ న్యాయాధికారి సేవా సంస్థ న్యూఢిల్లీ, రాష్ట్ర న్యాయ అధికార సేవా సంస్థ ఆదేశాల మేరకు ఈ నెల 26వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించాలని జిల్లా కేంద్రమైన మెదక్ జిల్లాలోని న్యాయమూర్తుల వర్చువల్ సమావేశంలో జిల్లా ఎస్.పి రోహిణి ప్రియదర్శిణి ఐ.పి.యెస్ మరియు జిల్లా అదనపు ఎస్.పి.డా.బి.బాలస్వామి ఐ.పి.యెస్ పాల్గొన్నారు. అనతరం జిల్లా ఎస్.పి మాట్లాడుతూ... జాతీయ లోక్ అదాలత్ లో సామరస్య ధోరణితో భూతగాదాలు, బ్యాంకు రికవరీ కేసులు ,వివిధ కేసుల పై న్యాయ స్థానాల చుట్టూ తిరగకుండా సామరస్య ధోరణితో జాతీయ లోక్ అదాలత్ లో కేసుల పరిష్కారం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో గౌరవనీయమైన జిల్లా సెషన్స్ జడ్జి పి. లక్ష్మీ శారద , సీనియర్ సివిల్ జడ్జి సి.హెచ్. జితేందర మొబైల్ మెజిస్ట్రేట్ బి. కల్పన క్లాస్ మేజిస్ట్రేట్లు ఎ. సిద్దయ్యయు.స్వాతి మరియు జిల్లా పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

ప్రైవేటు స్కూలు వద్దు, ప్రభుత్వ పాఠశాల ముద్దు : పధానోపాధ్యాయురాలు అరుణ




**ఇబ్రహీంపట్నం, జూన్17(అక్షర వెలుగు):** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం లోని దండుమైలారం గ్రామంలో గల హరిజన వాడ ప్రాథమిక పాఠశాలలో స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ మరాఠీ మహేందర్ అధ్యక్షతన పేరెంట్స్ టీచర్ మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎంపీటీసీబి2 పిట్టల అనసూయ సీతయ్య పాల్గొన్నారు. హరిజనవాడ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు అరుణ మాట్లాడుతూ ఇంగ్లీష్ మీడియం యొక్క ప్రాముఖ్యతను తెలియజేయడం జరిగింది. ప్రభుత్వ పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉంటారని, నాణ్యమైన విద్య, నాణ్యమైన ఉచిత భోజనంతో పాటు వారానికి మూడు కోడి గుడ్లు, ఉచిత పాఠ్యపుస్తకాలు, ఉచిత యూనిఫాం లు, ఉచిత ఆరోగ్య పరీక్షలు, సి సి ఈ పద్ధతిలో పాఠ్య బోధన, వినూత్న కార్యక్రమాలు, బాలల సంఘాలు నిర్వహణ, ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు , అన్ని ముఖ్య దినోత్సవ కార్యక్రమాలు ఉంటాయని తెలియజేయడం జరిగింది. అదేవిధంగా ప్రైవేట్ పాఠశాల వద్దు బి ప్రభుత్వ పాఠశాల ముద్దు అనే నినాదంతో మనమందరము ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలు చేర్పించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలు చేర్పించడానికి, ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువజన నాయకులు, ఎన్జీవోస్, డ్వాక్రా సంఘాల మహిళలు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమె అన్నారు. ఎంపీటీసీ అనసూయ సీతయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్క తల్లిదండ్రులు తమ పిల్లలను పరిశుభ్రంగా పాఠశాలకు పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. అదేవిధంగా హరిజనవాడ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరుణ కోరికమేరకు ఎంపీటీసీ అనసూయ సీతయ్య హరిజనవాడ ప్రాథమిక పాఠశాల కు ఐదు వేల రూపాయలను విరాళంగా ప్రకటించారు. స్కూల్ మేనేజ్మెంట్ చైర్మన్ మరాఠి మహేందర్ మాట్లాడుతూ పిల్లలకు క్రమశిక్షణ చాలా ముఖ్యమని, క్రమశిక్షణతో పాటు నాణ్యమైన విద్య మన పాఠశాలలో ఉంటుందని ప్రతి ఒక్క తల్లితండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు మాత్రమే పంపాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రదీప్ రెడ్డి, తల్లిదండ్రులు చీమల మహేశ్వర రావు, తాళ్ల గూడెం లింగం, సంపూర్ణ, లావణ్య, ఉమా, నగ్మా, అలివేలు , సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

## నిరుపయోగంగా ఉన్న వైకుంఠధామం నత్తనడకన పనులు



**మెదక్, జూన్17(అక్షర వెలుగు):** నియోజకవర్గం టేక్మాల్ మండలం వేల్పు గొండ గ్రామంలోని జాతీయ మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం( %చీ=×జు+హా%) లోని భాగంగా నిర్మించబడ్డ మొదటి విడత భాగంలో వైకుంఠధామం మంజూరు చేయడం జరిగింది. ఇట్టి వైకుంఠధామని గత నాలుగు సంవత్సరాల నుండి కాంట్రాక్టర్ మరియు అధికారులు కుమ్మక్కై నిర్లక్ష్యం వల్ల నత్తనడకన పనులు చాప కింద నీరులా చేయడం జరుగుతుంది. గ్రామ అధికారులకు వివరణ కోరగా కాంట్రాక్టర్ రేపు మాపు అంటూ సంవత్సరాలు గడుస్తున్నాయి . పనులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు చేయడం జరుగుతుంది. ఇట్టివైకుంఠ ధామానికి నాసిరకం ఇసుక నాసిరకం కంకర మరియు పాడైపోయిన సిమెంట్ బస్తాలతో ఇట్టి వైకుంఠధామం పూర్తిస్థాయిలో నిర్మించడం లేదు. వైకుంఠ ధామానికి ప్రవేశ మార్గం బోర్డు కూడా లేదు. చుట్టూ కాంపౌండ్ వాళ్ళు లేదా వైరుతో కంచెను నిర్మించడం లేదు. గ్రామంలో ఎవరైనా చనిపోయినచొ తమ సొంత పొలాల్లో దహన సంస్కారాలు చేయడం జరుగుతుంది. దీనికి ప్రధాన కారణం కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల వైకుంఠధామం పూర్తిస్థాయిలో నిర్వహించకపోవడం అని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా పై అధికారులు స్పందించి వెంటనే కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకొని ని వైకుంఠధామని సంబంధించిన పనులు పూర్తిస్థాయిలో నిర్మించాలని గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు

## నిఘా వ్యవస్థ నిద్ర పోతుందా: రఘునందన్

సికింద్రాబాద్ ఘటన వెనక కుట్ర

ప్రభుత్వ తీరును తప్పుపట్టిన ఈటెల

**హైదరాబాద్, జూన్17(అక్షర వెలుగు):** తెలంగాణలో నిఘా వ్యవస్థ నిద్రపోతోందా అని ఎమ్మెల్యే రఘునందన్‌రావు ప్రశ్నించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ టీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం కలిసి పోటీ చేయడానికి రంగం సిద్ధమని ప్రకటించారు. ప్రభుత్వ కుట్రలో భాగంగానే

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌పై దాడి చేశారని ఆరోపించారు. అభ్యర్థుల ముసుగులో ఎంఐఎం, టీఆర్ఎస్, కాంగ్రెస్ గూండాలు విధ్వంసం సృష్టించారని మండిపడ్డారు. ఘటనపై సీఎం కేసీఆర్, హోమ్ మంత్రి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. అగ్నిపథ్‌పై చర్చకు సిద్ధం.. ట్విటర్ పక్షి వస్తారా? అని రఘునందన్‌రావు ప్రశ్నించారు. ఇదిలావుంటే రాజకీయంగా మోదీ ప్రభుత్వాన్ని ఎదుర్కొనే దమ్ములేక.. అప్రదిష్టపాలు చేయాలన్న నీచమైన కుట్రతోనే సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ లో అల్లర్లు సృష్టించారని మాజీ మంత్రి ,బీజేపీ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ అన్నారు. ప్రభుత్వాల్లో ఉన్న వారు, బాధ్యత గలిగిన రాజకీయ పార్టీలు ఎక్కడ కూడా హింసను ప్రోత్సహించవన్నారు. రాజకీయాల్లో ప్రజల హృదయాను గెలుచుకోవాలన్నారు. ప్రజాక్షేత్రంలో పలుకుబడి కోల్పోయినటువంటి కొన్ని పార్టీలు..అసహనంతో ప్రజలను ఇబ్బంది పెట్టడం దుర్మార్గమైన చర్య మండిపడ్డారు. శాంతియుతంగా కొందరు నిరసన తెలపాలని వస్తే..వారిలో సంఘ విద్రోహ శక్తులు చొరబడి ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారన్నారు. రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లలో అత్యంత కట్టుదిట్టమైన భద్రతా, నిఘా ఉంటుందన్న ఈటెల..ఇలాంటి ప్రాంతాల్లో.. అల్లర్లు జరగడం అనుమానాలకు తావిస్తోందని చెప్పారు. నిరసనల గురించి ముందే తెలిసినా..కంట్రోల్ చేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం..పట్టించుకోకుండా వాటిని ప్రోత్సహించిందా అన్న అనుమానం కలుగు తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వమే ఆందోళనకారుల రూపంలో విధ్వంసం సృష్టించిందని భావిస్తున్నట్లు తెలిపారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఈటెల రాజేందర్ కోరారు. రాష్ట్ర ప్రభుత్వం విచారణ జరపకపోతే.. సీబీఐ ద్వారా విచారణ చేయించాలని కేంద్రాన్ని కోరతామని తెలిపారు. అటు అగ్నిపథ్ పథకం వల్ల నిరుద్యోగుల భవిష్యత్?కు ఎలాంటి ఇబ్బంది ఉండదని ఈటెల రాజేందర్ వెల్లడించారు. ఒక వేళ దీనిపై అభ్యంతరాలంటే కేంద ప్రభుత్వంతో చర్చలు జరిపాలని సూచించారు. మోదీ ప్రభుత్వం ప్రజా కోణంలో ఆలోచిస్తుందని చెప్పారు. ప్రజలు వ్యతిరేకించిన చట్టాలు, ప్రజలు ఇబ్బందులు పడే చట్టాలను గతంలో రద్దు చేసిన సంధ్బరాలున్నాయన్నారు.

## మిలటరీ ప్రవేటీకరణలో భాగమే అగ్నిపథ్



వెంటనే దాన్ని ఉపసంహరించుకోవాలి

కాంగ్రెస్ ప్రచారకమిటీ ఛైర్మన్ మధుయాష్కీ

**హైదరాబాద్,జూన్17(అక్షర వెలుగు):** దేశ భద్రతకు వెన్నుముకలా నిలిచిన మిలటరీని ప్రైవేటీకరించే సన్నాహాల్లో భాగంగా తీసుకువస్తున్న అగ్నిఫథ్ పథకాన్ని వెంటనే రద్దు చేయాలని తెలంగాణ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కీ గౌడ్ డిమాండ్ చేశారు. సికింద్రాబాద్ లో జరిగిన యువకుల ఆందోళనల్లో భాగంగా పోలీసులు కాల్పుల్లో రాకేష్ అనే యువకుడు మరణించడం అత్యంత దిగ్భ్రాంతిని కలిగించిందని, రాకేష్ మరణానికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. రాకేష్ కుటుంబానికి కోటి రూపాయల ఆర్థిక సాయాన్ని వెంటనే ప్రకటించాలన్నారు. ఒన్ ర్యాంక్ ఒన్ ఫెన్షన్ పథకానికి మంగళం పాడేలా నో ర్యాంక్.. నో ఫెన్షన్ పథకం అమలు చేయడంలో భాగంగా అగ్నిపథ్ కేంద్రం తీసుకువస్తోంది. మిలట్రీని ప్రైవేటీకరించడంతో పాటు, సైనిక విభాగాల్లో జీతభత్యాలు, ఇతర ఖర్చులు తగ్గించుకోవాలన్న దుర్మార్గమైన ఆలోచనతోన కేంద్రం ఈ పథకం తీసుకువస్తోంది. దీనిని కాంగ్రెస్ పార్టీ తరఫున తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు వెల్లడించారు. కరోనా కాలంనుంచి ఆర్మీలో రిక్రూట్ మెంట్ కోసం యువత ఎదురు చూస్తోంది. రెగ్యులర్ రిక్రూట్ మెంట్ చేయకుండా కాంట్రాక్ట్ ప్రాతిపదికన అగ్నిపథ్ పేరుతో రిక్రూట్ మెంట్లు చేసేందుకు కేంద్రం ఈ పథకాన్ని తీసుకువచ్చింది. సికింద్రాబాద్ లో శాంతియుతంగా నిరసన చేస్తున్న యువతపై పోలీసులు లాఠీఛార్జీ, కాల్పులు జరపడం అత్యంత అమానుషం. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నా. ? కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఉద్యోగ నియామకాలు చేపట్టాలి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా యువకుల సహనాన్ని ఇంకా పరీక్షించకుండా వెంటనే రిక్రూట్ మెంట్ మొదలు పెట్టాలని యాష్కీ డిమాండ్ చేశారు.

## సికింద్రాబాద్ ఘటన దురదృష్టకరం

కిసాన్‌ను, జవాన్‌ను రోడ్డున పడేసిన ప్రభుత్వం

మంత్రివేముల ప్రశాంత్ రెడ్డి



**హైదరాబాద్,జూన్17(అక్షర వెలుగు):** సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఘటన దురదృష్టకరమని రాష్ట్ర రోడ్లు భవనాలు, గృహ నిర్మాణ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. రైల్వేపోలీసు బలగాల కాల్పుల్లో ఒకరి మృతి చెందడం, పలువురికి గాయాలవడం పట్ల విచారం వ్యక్తం చేశారు. మొన్న కిసాన్ ను, నేడు జవాన్ ను రోడ్డు మీద పడేసిన ఘనత కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీదే అంటూ మండిపడ్డారు. ఓ వైపు ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు అమ్ముతూ.. మరోవైపు పెట్రోల్, డీజిల్, గ్యాస్ సిలిండర్ ధరలను పెంచి, లక్షల కోట్లు ఆదాయం పొందుతున్న కేంద్రం.. దేశ రక్షణను గాలికి వదిలేసి ఖర్చుకు వెనుకాడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'అగ్నిపథ్ పథకం' తీసుకొచ్చి దేశ రక్షణ కోసం తమ సేవలు అందించాలనుకునే యువతను కేంద్ర ప్రభుత్వం అవమానిస్తోందన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతులను, దేశానికి రక్షణగా నిలిచే సైనికులను నిర్లక్ష్యంగా చూడటం బాధాకరమన్నారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఘటనపై టీఆర్ ఎస్ హస్తం ఉందని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ ఆరోపించడాన్ని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. బీహార్, ఉత్తరప్రదేశ్ తో పాటు ఇతర రాష్ట్రాల్లో జరుగుతున్న ఆందోళనల వెనుక ఎవరు ఉన్నారని ప్రశ్నించారు. ఓటు బ్యాంకు రాజకీయాలు చేసే బీజేపీ నిర్ణయాల వల్ల నేడు దేశ వ్యాప్తంగా జరుగుతున్న అల్లర్లు కనిపించడం లేవా..? అన్ని ప్రశ్నించారు. బండి సంజయ్ లాంటి నాయకులు యువతను రెచ్చగొట్టడం వల్లే దేశంలో అశాంతి, అభద్రత భావం నెలకొందని ఆరోపించారు. ఆందోళనలు చేస్తున్న యువకులు సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై శాంతియుతంగా, ప్రజాస్వామ్య బద్ధంగా పోరాడుదామని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఆస్తులకు ఎవరూ నష్టం కలిగించవద్దని కోరారు. నిరుద్యోగ యువత న్యాయమైన డిమాండ్ల పరిష్కారం పట్ల కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించి, సత్వరమే సమస్యకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.

## హింసాత్మక నిరసనలకు పాల్పడవద్దు

యువతకుకేంద్రమంత్రి వైష్ణవ్ సూచన

ఆర్మీలో చేరేందుకు సువర్ణావకాశం అన్న ఆర్మీ చీఫ్

**న్యూఢిల్లీ, జూన్17(అక్షర వెలుగు):** హింసాత్మక నిరసనలకు పాల్పడవద్దని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వని వైష్ణవ్ శుక్రవారంనాడు దేశ యువతకు విజ్ఞప్తి చేశారు. రైల్వేల ఆస్తుల ధ్వంసం చేయవద్దని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన అగ్నిపథ్ పథకానికి నిరసనగా దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో నిరసనలు, హింసాత్మక ఘటనలు, రైళ్లు తగుల పెట్టడం, విధ్వంసాలకు పాల్పడటం వంటి ఘటనలు చోటుచేసుకుండటంతో కేంద్ర మంత్రి ఈ విజ్ఞప్తి చేశారు. దేశవ్యాప్తంగా పెల్లుబుకుతున్న నిరసనల నేపథ్యంలో భారత సైన్యాధిపతి జనరల్ మనోజ్ పాండే సైతం యువత ఆందోళనను చల్చార్చేందుకు కీలక ప్రకటన చేశారు. అగ్నివీరుల నియామకం కోసం వయో పరిమితిని 21 సంవత్సరాల నుంచి 23 సంవత్సరాలకు కేంద్రం పెంచిదన్నారు. ఇది సువర్ణావకాశమని, నియామకాల ప్రక్రియను త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. కోవిడ్ మహమ్మారి కారణంగా రెండేళ్లుగా రిక్రూట్‌మెంట్ లేక నిరాశకు గురైన వారికి కూడా వయోపరిమితి పెంపు వల్ల ప్రయోజనం జరుగుతుందన్నారు.విపక్షాలపై మండిపడిన వీకే సింగ్ ఆర్మీలో స్వల్పకాలిక రిక్రూట్‌మెంట్ అంటూ అగ్నిపథ్ స్కీమ్‌పై విపక్షాలు వివాదం సృష్టిస్తూ ప్రజలను రెచ్చగొడుతున్నాయని కేంద్ర మంత్రి, మాజీ ఆర్మీ చీఫ్ వీకే సింగ్ (రిటైర్డ్) ఆరోపించారు. విపక్షాలు చేసేందుకు పనేమీ లేకపోవడంతో కనీసం రిక్రూట్‌మెంట్ కూడా ప్రారంభం కాకుండా వివాదం రేపుతున్నాయని అన్నారు. కేంద్ర పథకంలో ఎలాంటి వివాదం లేదని, ప్రతిపక్షాలే వివాదం సృష్టిస్తున్నా యని నాగపూర్ విమానాశ్రయంలో హింసాత్మక ఘటనల అనంతరం వీకే సింగ్ మీడియాతో మాట్లాడుతూ అన్నారు.




# చలన చిత్రం

## కమల్‌తో పనిచేయడమే గిఫ్ట్ అన్న అనిరుధ్



సుమారు నాలుగేళ్ల తర్వాత బాక్సాఫీస్ వద్ద సందడి చేశాడు లోక నాయకుడు కమల్ హాసన్. ఆయన తాజాగా నటించిన విక్రమ్ మూవీ బ్లాక్‌బ్లస్టర్ హిట్‌గా నిలిచింది. ఇప్పటి వరకు ఈ మూవీ వరల్డ్ వైడ్‌గా రూ. 300 కోట్లు వసూళు చేసింది. కమల్ స్వయంగా నిర్మించిన ఈ మూవీ భారీ హిట్ అందుకోవడంతో ఆయన ఫుల్ ఖుషిలో ఉన్నాడు. విక్రమ్ ఇంతపెద్ద హిట్ అయినందుకు ఇందులో భాగమైన చిత్రం యూనిట్‌కు ఖరీదైన బహుమతులు ఇచ్చిన సింగతి తెలిసిందే. ఈ సినిమా విజయంలో పాటలు, సంగీతం కూడా ముఖ్య పాత్ర పోషించాయి. అయితే ఈ సినిమాకు అద్భుతమైన సంగీతం అందించిన అనిరుద్ రవిచందర్‌కు మాత్రం కమల్ ఏ గిఫ్ట్ ఇవ్వలేదట. ఈ విషయాన్ని అనిరుధ్ స్వయంగా వెల్లడించాడు. విక్రమ్ సక్సెస్ నేపథ్యంలో ఇటీవల అనిరుధ్ రవిచందర్ ఓ చానల్‌తో ముచ్చటించాడు. ఈ సందర్భంగా విక్రమ్ సక్సెస్‌కి కమల్ సర్ అందరికి గిఫ్ట్ ఇస్తున్నారు.. మరి ఆయన నుంచి మీకు గిఫ్ట్ ఏం రాలేదా? అని అడగడంతో అనిరుధ్ ఇలా స్పందించాడు.'కమల్ హాసన్ సర్ నుంచి నాకు ఎలాంటి బహుమతి అందలేదు. అసలు ఆయనతో పని చేసే అవకాశం రావడమే నాకు పెద్ద గిఫ్ట్. ఇంకా సపరేట్‌గా ఎలాంటి గిఫ్ట్ అవసరం లేదు' అంటూ సమాధానం ఇచ్చాడు. కాగా ఈ మూవీ దర్శకుడు లోకేశ్ కనగరాజుకు కోటీ విలువ చేసే లెక్సాస్ లగ్జరీ కారును కమల్ బహుమతిగా ఇవ్వగా.. డైరెక్షన్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసిన 13 మందికి బైక్‌లు ఇచ్చాడు. ఇక ఇందులో కీ రోల్ పోషించిన హీరో సూర్య రూ. 60 లక్షలు విలువ చేసే రోలెక్స్ వాచ్ కానుక ఇచ్చాడు. ఇక మరో ప్రధాన పాత్రలు పోషించిన య్‌సేతుపతి, ఫాహద్ ఫాజిల్‌లకు కూడా ఆయన ఎలాంటి కానుకలు ఇవ్వలేదని తెలుస్తోంది.

## నిర్మాతగా ఎంట్రీ ఇస్తున్న పూరీ తనయ పవిత్ర



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ తో బద్రి సినిమా తీసి ఒక్కసారిగా టాలీవుడ్‌లో సంచలనం సృష్టించారు పూరి జగన్నాధ్. ఆ తర్వాత పక్కా మాస్ ఎంటర్‌టైనర్స్ తీస్తూ డాషింగ్ డైరెక్టర్‌గా అసాధారణమైన క్రేజ్‌ను సంపాదించుకున్నారు. దర్శకుడిగా మాత్రమే కాకుండా సొంత సంస్థలను స్థాపించి సినిమాలను నిర్మిస్తున్నారు పూరి. అయితే, ఇప్పుడు పూరి తనయ పవిత్ర టాలీవుడ్‌లో నిర్మాతగా ఎంట్రీ ఇవ్వబోతుందని వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే, పూరి కొడుకు ఆకాష్ పూరి హీరోగా పరిచయమై నెమ్మదిగా నిలదొక్కుకునేందుకు ప్రయత్నిస్తున్నాడు. తండ్రి దర్శకత్వంలోనే 'మెహబూబా' సినిమాతో హీరోగా మారిన ఆకాష్, ఆ తర్వాత 'రొమాంటిక్' సినిమాతో వచ్చి ఆకట్టుకున్నాడు. ఈ సినిమాలు సక్సెస్ కాకపోయినా కూడా పర్ఫార్మెన్స్ పరంగా ఆకాష్ మంచి పేరు తెచ్చుకున్నాడు. ఈ క్రమంలోనే పూరి కూతురు పవిత్ర ప్రొడక్షన్ వైపు అడుగులు వేయబోతుందట. ప్రస్తుతం ఛార్మితో కలిసి పూరి కనెక్ట్స్ బ్యానర్‌ను స్థాపించిన పూరి, భారీ బ్జడెట్ చిత్రాలను నిర్మిస్తున్నారు. ఈ సంస్థ నుంచి ఇదే ఏడాది విజయ్ దేవరకొండ - అనన్య పాండే జంటగా నటించిన పాన్ ఇండియా చిత్రం 'లైగర్' రాబోతోంది. అలాగే, పూరి డ్రీమ్ ప్రాజెక్ట్ 'జనగణమన' విజయ్ దేవరకొండతో రూపొందిస్తున్న సంగతి తెలిసిందే. ఈ పాన్ ఇండియన్ సినిమాలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ మూవీని వచ్చే ఏడాది రిలీజ్ చేనునున్నారు. అయితే, పూరి కనెక్ట్స్ నిర్మాణ సంస్థ బాధ్యతలను పవిత్రకు అప్పగించబోతున్నట్టు టాక్ వినిపిస్తోంది.



## ఏజెంట్ ద్వారా హిట్ కోసం అఖిల్ చూపు

అక్కినేని నట వారసుడు అఖిల్ కమర్షియల్ హిట్టు కోసం ఎంతగానో ఎదురుచూస్తున్నాడు. కెరీర్ ఆరంభం నుంచి వరుస ఎ÷-లాపుల్లో ఉన్న అఖిల్‌కు 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్' కాస్త ఊరటనిచ్చింది. కానీ ఈ చిత్రం అఖిల్‌కు మాత్రం కమర్షియల్ హిట్టును ఇవ్వలేకపోయింది. దాంతో ఈ సారి ఎలాగైనా బ్లాక్‌బస్టర్ హిట్టు కొట్టాలని సురేందర్ రెడ్డితో చేతులు కలిపాడు. ప్రస్తుతం వీళ్ళ కాంబోలో తెరకెక్కుతున్న చిత్రం 'ఏజెంట్'. అఖిల్ ఈ చిత్రం కోసం పూర్తిగా మేకోవర్ అయినట్లు గతంలో విడుదలైన పోస్టర్‌లను చూస్తే తెలుస్తుంది. కండలు తిరిగిన దేహంతో అఖిల్ 'రా ఏజెంట్'గా ఈ చిత్రంలో కనిపించనున్నాడు. పాన్ ఇండియా సినిమాగా తెరకెక్కుతున్న ఈ చిత్రం అగస్టు 12న విడుదల కానున్నట్లు మేకర్స్ గతంలోనే ప్రకటించారు. అయితే తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం ఏజెంట్ చిత్రం వాయిదా పడనుందట. ఈ చిత్రం అనౌన్స్ చేసినప్పటి నుండి షూటింగ్‌కు అంతరాయం కలుగుతూనే ఉంది. ఇప్పటికే షూటింగ్ పలుమార్లు వాయిదా పడుతూ వచ్చింది. ఇక ఈ చిత్రంలో యాక్షన్ సన్నివేశాలు ప్రధానంగా ఉండటంతో షూటింగ్‌కు చాలా సమయం పడుతుందట. దాంతో చిత్ర బృందం విడుదల తేదీని వాయిదా వేయాలని భావిస్తుందట. దీనిపై త్వరలోనే అధికారికంగా ప్రకటన రానున్నట్లు టాక్. మలయాళ స్టార్ మమ్ముట్టి కీలక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రాన్ని ఏకే ఎంట్టంల్గ÷నమెంట్స్ బ్యానర్‌తో కలిసి సురేందర్ రెడ్డి స్వీయ నిర్మాణంలో తెరకెక్కిస్తున్నాడు. అఖిల్‌కు జోడీగా సాక్షీ వైద్య హీరోయిన్‌గా నటిస్తుంది. ఇటీవలే అఖిల్ మనాలీ షెడ్యూల్‌లో దిగిన ఫోటోలను షేర్ చేసిన విషయం తెలిసిందే.

## సర్కారి వారి పాటతో అభిమానుల హుషార్

### థియేటర్‌లో మ...మ..మహేశ్ పాటకు స్టెప్పులు





సూపర్ స్టార్ మహేష్‌బాబు ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'సర్కారు వారి పాట'అభిమానుల్లో జోష్ నింపింది. ఈ చిత్రంలో మహేష్‌బాబు క్యారెక్టరైజేషన్, ఎనర్జీ గత చిత్రాలకు భిన్నంగా ఉంది. యాక్షన్ డ్రామాగా తెరకెక్కిన ఈ చిత్రం మే 12న విడుదలై మిక్స్ టాక్ తెచ్చుకుంది. కానీ కలెక్షన్లలో మాత్రం జోరు చూపించింది. మహేష్ కెరీర్‌లోనే హైయెస్ట్ ఓపెనింగ్స్ సాధించిన చిత్రంగా సర్కారు వారి పాట నిలిచింది. ఈ చిత్ర విజయంలో పాటలు కూడా కీలకపాత్ర పోషించాయి. తమన్ స్వర పరిచిన అన్ని పాటలకు శ్రోతల నుండి విశేష స్పందన వచ్చింది. ముఖ్యంగా ఈ చిత్రంలోని 'మ.. మ.. మహేషా' అనే మాస్ బీట్‌కు థియేటర్‌లలో ప్రేక్షకులు తెగ ఎంజాయ్ చేశారు. తాజాగా ఈ వీడియో సాంగ్‌ను మేకర్స్ యూట్యూబ్‌లో విడుదల చేశారు. శ్రీకృష్ణ, జోనితా గాంధీ ఆలపించిన ఈ పాటకు అనంత శ్రీరామ్ సాహిత్యం అందించాడు. ఈ పాటలో మహేష్, కీర్తి సురేష్ డ్యాన్స్‌కు ప్రేక్షకులు ఫిదా అయ్యారు. ఇటీవలే విడుదలైన మురారి వా, పెన్నీ వీడియో సాంగ్స్ మిలియన్ల వ్యూస్‌ను సొంతం చేసుకున్నాయి. యాక్షన్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రాన్ని 14రీల్స్ ఎంట్టంల్గ÷నమెంట్స్, మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌లతో కలిసి మహేష్ స్వీయ నిర్మాణంలో తెరకెక్కించాడు. సముద్రఖని ప్రతినాయకుడి పాత్రలో నటించాడు.ప్రస్తుతం ఈ చిత్రం అమెజాన్ ప్రైమ్‌లో పే పర్ వ్యూ పద్ధతిలో స్ట్రీమింగ్ అవుతుంది. అయితే జూన్23 నుండి ప్రైమ్ సబ్‌స్క్రైబర్‌లకు ఈ చిత్రం ఉచితంగా అందుబాటులోకి రానుంది.

## ఇక కమర్షియల్ సినిమాలపై దృష్టి: రానా



రానా అంటేనే ప్రయోగాలు. లీడర్తో కెరీర్ బిగిన్ చేసినప్పటి నుంచి ఈ దగ్గుబాటి హీరో కొత్తదారిలో వెళ్లే ప్రయత్నమే చేసాడు. అతని సినిమాలు డిఫరెంట్ గా ఉంటాయి. క్యారెక్టర్స్ ఇంకాస్త కొత్తగా కనిపిస్తాయి. ప్రతిసారి కొత్త కథను చెప్పేందుకు ట్రై చేస్తూ వచ్చాడు. అందుకు కారణం తనకంటూ ఓ ప్రత్యేకమైన ఫ్యాన్ ఫాలోయింగ్ లేదని రానా ఫిక్స్ కావడమే. కానీ విరాటపర్వం చేస్తున్న సమయంలో తనకున్న ఫ్యాన్ ఫాలోయింగ్ అర్ధమైంది. అభిమానులు ఏం కోరుకుంటున్నారో అర్ధమైంది. అందుకే ఫ్యాన్స్ కోసం ఇకపై ప్రయోగాలు చేయను, విరాటపర్వం మాత్రమే లాస్ట్ అంటూ అని ప్రీరిలీజ్ ఈవెంట్‌లో మాట ఇచ్చాడు. ఇకపై కమర్షియల్ సినిమాలు మాత్రమే చేస్తానంటున్నాడు. ఇప్పటి వరకు రానా చేసిన జర్నీలో ఎన్నో వైవిధ్యమైన పాత్రలు చేశాడు.బాహుబలిలో భల్లాలదేవ, రుద్రమదేవిలో చాలుక్య వీరభద్ర, నేనే రాజు నేనే మంత్రిలో జోగేంద్ర, భీమ్లా నాయక్ లో డేనియల్ శేఖర్ రోల్స్ రానాకు చాలా మంచిపేరు తెచ్చిపెట్టాయి. ఇకపై కంప్లీట్ గా హీరోగా మారి తాను కూడా మూవీస్ ఫర్ ఫ్యాన్స్ ట్రెండ్ ఫాలో అవుతానంటున్నాడు. మరి ఏ జానర్ చిత్రాలతో రానా అలరిస్తాడో చూడాలి.

# జైలర్‌గా వస్తున్న రజనీకాంత్






తలైవా రజనికాంత్ 169వ చిత్రానికి రెడీ అవుతున్న విషయం తెలిసిందే. బీస్ట్ చిత్రం ఫేమ్ నెల్సన్ దర్శకత్వంలో తెరకెక్కనున్న ఈ చిత్రానికి జైలర్ అనే టైటిల్‌ను ఖారారు ఈ మేరకు టైటిల్ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. కత్తికి రక్తపు మరకలతో పోస్టర్ రూపొందించారు. జైలు నేపథ్యంలో రూపొందే ఈ మూవీని ప్రతిష్టాత్మక బ్యానర్ సన్ పిక్చర్స్‌పై కళానిధి మారన్ నిర్మిస్తున్నండగా.. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నాడు.సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా రూపొందనున్న కొత్త చిత్రానికి పవర్ ఫుల్ టైటిల్‌ను చిత్ర బృందం ప్రకటించింది. టాలెంటెడ్ డైరెక్టర్ నెల్సన్ దిలీప్ కుమార్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ సన్ పిక్చర్ ఈ సినిమాను ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భారీ బడ్జెట్‌తో నిర్మిస్తుంది. అయితే, తాజాగా ఈ మూవీ టైటిల్‌ను మేకర్స్ అనౌన్స్ చేశారు.సూపర్ స్టార్ 169వ చిత్రానికి 'జైలర్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ మేరకు తాజాగా టైటిల్ పోస్టర్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. ఇక ఈ పోస్టర్‌లో రక్తంతో తడిసిన ఓ పెద్ద కత్తి వేలాడదీయబడి ఉండటం ఆసక్తికరంగా ఉంది. ఈ టైటిల్‌ను బట్టి రజినీ సినిమాలో జైలర్‌గా కనిపిస్తారని అర్థం అవుతుంది. జైలులోని ఖైదీల నేపథ్యంలో ఈ సినిమా ఉంటుందనే టాక్ కూడా వినిపిస్తోంది. అంతేకాదు, భారీ స్థాయిలో యాక్షన్ సీక్వెన్స్ కూడా ఉంటాయని తెలుస్తుంది. కోలీవుడ్ మ్యూజిక్ సెన్సేషన్ అనిరుధ్ రవిచందర్ 'జైలర్' సినిమాకు సంగీతం అందిస్తున్నాడు. మాజీ ప్రపంచసుందరి ఐశ్వర్య రాయ్ రజనీకి జంటగా నటించబోతుందనే ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే ఈ జంట శంకర్ రూపొందించిన 'రోబో'లో నటించిన సంగతి తెలిసిందే. మరి జైలర్ మూవీలో ఐశ్వర్య రాయ్ హీరోయిన్‌గా నటిస్తుందా లేదా అనేది కూడా త్వరలో క్లారిటీ వస్తుంది. 'కబాలి' నుంచి 'అణ్ణాత్త' వరకు రజనీ నటించిన ఏ సినిమా ఆశించిన విజయాన్ని అందుకోలేదు. మరి 'జైలర్'తో అయినా సూపర్ స్టార్ సాలీడ్ హిట్ అందుకుంటారేమో చూడాలి.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **GPR PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
TITLE CODE.TELTEL02057, Cell:8464816456 Email: aksharavelugudaily@gmail.com, Website: www.aksharavelugu.com